# వాస్తవం

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

గురువారం 19.03.2026

డెయిలీ.కామ్

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి



జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్స్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110


## జీతాలు తీసుకుంటూ..

# సభకు రారా?

### కేసీఆర్‌పై రేవంత్ మండిపాటు

- గవర్నర్ ప్రసంగం భవిష్యత్తు తెలంగాణకు ఒక విజన్ డాక్యుమెంట్
- ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు ఎందుకు రాలేదు
- నియంత పోకడలను అనుసరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు
- రాజులు పోయినా, రాజ్యాలు పోయినా... కొందరిలో రాచరిక పోకడలు మాత్రం పోలేదు

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగం రాష్ట్ర అభివృద్ధికి ఒక మార్గదర్శిగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగం కేవలం ప్రభుత్వ కార్యక్రమాల జాబితా కాకుండా, భవిష్యత్తు తెలంగాణకు ఒక విజన్ డాక్యుమెంట్‌గా నిలిచిందని పేర్కొన్నారు. ఈరోజు(బుధవారం) అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ ప్రజల ఆశయాలను ప్రతిబింబించిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని చూపించిందని చెప్పుకొచ్చారు. భవిష్యత్తు ఆర్థిక ప్రణాళికలకు బలమైన పునాది వేసిందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



12లో..

## మొదటి విడతలోనే ప్రతి రైతుకూ భరోసా

- 70 లక్షల మంది ఖాతాలకు ఒకే రోజు నగదు బదిలీ
- తొలిరోజు ఎకరం విస్తీర్ణం వరకు డబ్బుల చెల్లింపు..
- ఐదెకరాలు పదెకరాలున్నా ఎకరానికి సాయం

**హైదరాబాద్, మార్చి 18 :** రైతు భరోసా పథకాన్ని గతానికి భిన్నంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఒక రోజు ఎకరం వరకు, రెండోరోజు రెండెకరాలకు, మూడో రోజు మూడెకరాలకు... ఇలా ఆరోహణ పద్ధతిలో కాకుండా ప్రతి రైతుకు మొదటి రోజే పెట్టుబడి సాయం అందేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 22న విడుదలచేసే మొదటి విడతలో ఒకే రోజు 70 లక్షల మందికి రైతు భరోసా చెల్లిస్తారు. అంటే.. మొదటి రోజు ఎకరం విస్తీర్ణం వరకు నగదు బదిలీచేస్తారు. అంటే ఒక రైతుకు రెండెకరాలుంటే.. తొలి విడతలో ఒక ఎకరానికి రైతు భరోసా అందుతుంది. ఐదెకరాలున్నా, పదెకరాలున్నా.. ఒక ఎకరానికి రూ.6 వేలు తొలిరోజు రైతు భరోసా అందుతుంది. ఒక వేళ ఎకరం కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు... ఎంత భూమి ఉంటే ఆ లెక్క ప్రకారం రైతు భరోసా చెల్లిస్తారు. ఈ మేరకు



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది.యాసంగి రైతు భరోసాను ఈనెల 22న ప్రారంభిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే!

## ఇది సర్కార్ కాదు..

# సర్కస్

### పాకిస్థాన్ కూడా బ్లాక్ లిస్టులో పెట్టిన కంపెనీకి మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును అప్పగించడమా?: కేటీఆర్



**హైదరాబాద్, మార్చి 18 :** మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, ఈ ప్రాజెక్టు పేరిట జరుగు తున్న అవినీతిని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేదని విమర్శించారు. బుధవారం బీఆర్ ఎస్ఎల్పీలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పాకిస్థాన్‌కు కూడా పనికిరాని వివాదాస్పదమైన కంపెనీకి కాంగ్రెస్ సర్కార్ రెడ్‌కార్పెట్ వేసిందని ఎద్దేవా చేశారు. 'మెయిన్‌హార్ట్ అనే సింగపూర్ కంపెనీని పాకిస్థాన్ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. పట్నా ఎయిర్ పోర్టులో అవకతవకలకు పాల్పడటంతో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) కూడా ఆ కంపెనీని నిషేధించింది. జార్ఖండ్‌లో ఒక స్టేడియాన్ని రూ.200కోట్ల అంచనాతో ప్రతిపాదించి, ఆ మొత్తాన్ని రూ.500కోట్లకు పెంచిన ఘనత మెయిన్‌హార్ట్ కంపెనీది. భారీగా అవకతవకలకు పాల్పడటంతో సింగపూర్ ప్రభుత్వం కూడా ఈ కంపెనీపై కేసు నమోదు చేసింది. అలాంటి కంపెనీకి కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే బాధ్యతలను అప్పగించింది.. ఎందుకు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. 'ఇది సర్కార్ కాదు.. సర్కస్" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.






## ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగానికి డీపీఆర్ ఖరారు

### కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ, మార్చి 18 :** హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం డీపీఆర్ ఖరారైందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. మొత్తం ఆర్ఆర్ఆర్ అభివృద్ధికి డీపీఆర్ తయారుచేసేందుకు కన్సల్టెన్సీని ఆమోదించామని రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి బుధవారం అడిగిన ప్రశ్న కు సమాధానంగా చెప్పారు. జాతీయ రహదారి 65 కింద హైదరా బాద్- విజయవాడ- మచిలీపట్నం సెక్షన్‌లో ప్రస్తుత నాలుగు లైన్ల రహదారిని ఆరు లైన్ల యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ రూపకల్పన జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కారిడార్ వల్ల హైదరాబాద్ నుంచి విజయవా డ/అమరావతికి, మచి లీపట్నం రేవుకు నిరంతర హైస్పీడ్ అనుసంధానం జరుగుతుందని ఆయన చెప్పారు.

# వందేమాతరానికి అవమానం

**కాంగ్రెస్ మౌనంపై బీజేపీ ఫైర్**

**- అసెంబ్లీలో వందేమాతరం సందర్భంగా ఎంఐఎం వాకౌట్**

**- లష్కరే తోయిబాకి కాంగ్రెస్ సపోర్టా?**

**- అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**

**వాస్తవం, గజ్వేల్ ఆర్ సి :**



అసెంబ్లీలో వందేమాతరం గేయం సందర్భంగా ఎంఐఎం సభ్యులు వాకౌట్ చేయడంపై గజ్వేల్‌లో బిజెపి నాయకులు బుధవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించడం దురదృష్టకరమని విమర్శించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్, గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అసెంబ్లీ సమావేశాల ఆరంభంలో భారతమాతకు వందనం చేస్తూ వందేమాతరం ఆలపిస్తుండగా ఎంఐఎం సభ్యులు వాకౌట్ చేయడం దేశాన్ని, రాజ్యాంగాన్ని అవమానించడమేనని మండిపడారు. అలాంటి ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకుని వారి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హిందూ సాంస్కృతిక సంప్రదాయాలపై వరుసగా దాడులు జరుగుతున్నప్పటికీ లష్కరే తోయిబాకి వంటి ఉగ్రవాద వర్గాలకు కాంగ్రెస్ మద్దతు ఇస్తోందా అనే ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయాలపై దాడులు, గోరక్షకులపై దాడులు, హిందూ దేవతలపై అవమానకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎంఐఎం పార్టీతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తూ వారి విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. హిందువుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అదే ప్రజల భావాలను అవమానిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ సమాజం ఏకమై ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పాలని, అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కుడిక్యాల రాములు, బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, చెప్యాల వెంకట్ రెడ్డి, నాయిని సందీప్ కుమార్, నాగు ముదిరాజ్, మన్నె శేఖర్, భినమైన ప్రభాకర్, కుమార్ గౌడ్, ఇప్ప స్వామి, బారు అరవింద్, పంజాల వెంకట్, అనిల్, తలారి రాజు, రొట్టెల దాస్, కదుల దేవేందర్, కర్ణాల శ్రీనివాస్, శ్రీరామ్ కృష్ణ, శ్రీనివాస్ చారి, ఎల్ల మధు, శాతం స్వామి, కూర స్వామి, రాజేశ్వర్ చారి, రోహిత్ నాని పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా నాచగిరిలో శ్రీ లక్ష్మీ నృసింహ విమాన రథోత్సవం

**- భక్తులు హరిద్రా నదిలో పుణ్యస్నానాలు**

**- భక్తి పారవశ్యంతో విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు**

**- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహణ**

**వాస్తవం, గజ్వేల్ ఆర్ సి :**



ప్రసిద్ధ నాచగిరి శ్రీ లక్ష్మీ నృసింహ క్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి విమాన రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, కార్యనిర్వహణ అధికారి బెల్లంకొండ రంగాచారి ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి వేద పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల హర్షధ్వానాల మధ్య రథప్రతిష్ట నిర్వహించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన విమాన రథంపై సతీసమేతులైన శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారిని అధిష్టింపజేశారు. తదనంతరం భక్తుల దర్శనార్థం ఉంచగా, అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు హరిద్రా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. ఈ సందర్భంగా నాచగిరి, శ్వేతగిరి కొండలు స్వామివారి నామస్మరణతో మార్మోగాయి. భక్తుల భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మహిళల కోలాటాలు, పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలు భక్తులను కనువిందు చేశాయి. నాచగిరి పురవీధుల్లో విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తుల కోలాహలం మధ్య స్వామివారిని అత్యంత వైభవంగా ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు విజయ మోహన్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీలు నిమ్మ రంగారెడ్డి, మాజీ జెడ్పీటీసి బాలు యాదవ్, కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, స్థానిక సర్పంచ్ సారిక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## గంగారంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం





**వాస్తవం: కాటారం**

కాటారం మండలంలోని గంగారం గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మోడల్ స్కూల్‌లో గంగారం సర్పంచ్ బండం శోభారాణి ప్రారంభించారు. గ్రామ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి సాధించాలని సూచించారు. కుట్టు శిక్షణ ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడటంతో పాటు కుటుంబాలకు తోడ్పాటు అందించగలరని అన్నారు. గ్రామీణ మహిళల సాధికారతకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అలాగే గంగారం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రం-4లో విద్యార్థులకు సర్పంచ్ బండం శోభారాణి, పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ కలిసి యూనిఫాంలను పంపిణీ చేశారు. గర్భిణీ మహిళలకు శ్రీమంతం నిర్వహించి తల్లి--బిడ్డల సంరక్షణపై సూపర్వైజర్ వీణ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముల్కల నగేష్ వార్డు సభ్యులు సరోజన అంగన్‌వాడి టీచర్ సునీత, ఆయా పద్మ పాల్గొన్నారు.

# ఆరెకటికల సమస్యలు పట్టించుకోండి

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మిర్యాలకార్ శ్రీనివాస్ విజ్ఞప్తి**

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**

తెలంగాణ ఆరెకటిక అభివృద్ధి సంఘం ఉపాధ్యక్షుడు మిర్యాలకార్ శ్రీనివాస్ ఆరెకటికల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేస్తూ ఆరెకటికల జీవనోపాధి, హక్కుల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరెకటికలు సంప్రదాయ కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి ప్రత్యేక కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాలు ఆరెకటికలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు, తెలంగాణలో కూడా అదే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరెకటికలను ప్రత్యేకంగా గుర్తించి బీసీఏ హోదా కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయాలని, సారావృత్తిపై ఆధారపడి జీవించే వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు అమలు చేయాలని అన్నారు. అలాగే వైన్స్ టెండర్లలో ఆరెకటికలకు వాటా కల్పించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఆరెకటికల జనాభా సుమారు 10 లక్షలు ఉంటుందని అంచనా వేస్తూ, వారి వృత్తుల ద్వారా ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం కోట్ల రూపాయల ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. అయినప్పటికీ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా ఈ కులానికి సరైన గుర్తింపు లేకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కోకాపేటలో ఆరెకటికల భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వం ఎకరం భూమి, రూ.1 కోటి నిధులు కేటాయించినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. 50 సంవత్సరాలు నిండిన కోత కార్మికులకు పింఛన్ సదు



పాయం కల్పించాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆరెకటిక అభివృద్ధి సంఘం నాయకుడు బొంపల్లి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరెకటికలను ఏకం చేస్తూ త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని హెచ్చరించారు.

# గుండెపోటుతో బీజేపీ నాయకుడు మృతి

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు చందుపట్ల రాజిరెడ్డి (44) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం రోజున హనుమాన్ మాల ధరించి సన్నిధిలో ఉండగా అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైద రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సుమారు 1:05 గంటలకు తుదిశ్వాస విడి చారు. రాజిరెడ్డి మృతితో ఎల్లారెడ్డిపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. రాజిరెడ్డి రైతు కుటుంబంలో జన్మించి, మండల కేంద్రంలో రైస్ మిల్ స్థాపించి వ్యాపారవేత్తగా ఎదిగారు. రైస్ మిల్లర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచే శారు. చురుకైన బీజేపీ కార్యకర్తగా, నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల బీజేపీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# రంజాన్ కానుక పంపిణీ



**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**

బుధవారం రోజున ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో రంజాన్ కానుకగా ముస్లిం పేద మహిళలకు ఈద్ ముబారక్ ఈద్ కా తోఫాలో భాగంగా చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ చైర్మన్ షేక్ గౌస్, నారాయణపూర్ ఉప సర్పంచ్ మధు సుధన్ , నారాయణపూర్ వార్డు మెంబర్ షేక్ సమద్ ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దొమ్మటి రాజు. తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్**

**వాస్తవం, హుస్నాబాద్ :**

అకాల వర్షంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుని అన్నదాత కు ఊరట కలిగించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు,గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో గల భీమదేవరపల్లి, సైదాపూర్, హుస్నాబాద్ , అక్కన్న పేట తదితర మండలాల్లో మామిడి మరియు మొక్కజొన్న పంటలకు భారీ నష్టం వాటిల్లిందని, దీనిపై వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. అలాగే పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. చేతికొచ్చిన పంట నేలరాలిపోవడంతో అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వపరంగా నష్టపరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈసారి భారీగా మామిడి కాత వచ్చిందని దీనిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతన్నలకు దుఃఖమే మిగిలిందని ఈ తరుణంలో రైతులను ప్రభు త్వం



ఆదుకొని భరోసా కల్పించాలని కోరారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సర్కార్ పెద్దపీట

**- పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనుల మంజూరి**

**- రూ 5.41 కోట్లతో సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం**

**- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**వాస్తవం : గజ్వేల్ ఆర్ సి**

గ్రామీణ ప్రాంతాల అభివృ ద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధ వారం గిర్మాపూర్‌లో స్థానిక సర్పంచ్ చిట్కుల విజయ లక్ష్మితో కలిసి మురికి కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ... నియో జకవర్గ పరిధిలోని అన్ని గ్రా మాలకు సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలో రూ 5 కోట్ల 41 లక్షలు మంజూరీ చేసిందని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా నిధులు, ప్రభుత్వ పథకాలను వర్తింప జేస్తుండగా, సర్పంచులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుం టుండగా, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ తదితర కేటాయిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా రూ 2 లక్షల వరకు పంట రుణమాఫీ, సన్నధాన్యానికి రూ 500 బోనస్ చెల్లిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోగా, మరో నాలుగు రోజుల్లో రైతు భరోసా నిధు లు అన్నదాతల ఖాతాలలో జమ



చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీల్లో భా గంగా ప్రతి ఇంటికి ప్రజా సం క్షేమ పథకాలు వర్తింప జేస్తుం డగా, జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ లక్ష్యంగా విమ ర్శలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే గజ్వేల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి అడిగినన్ని నిధులు ఇస్తు ండగా, విద్య, వైద్యం, రవాణా, పారిశ్రామిక రంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, కాం గ్రెస్ సర్పంచ్ల ఫోరం అధ్య క్షులు కేసరి వెంకటేష్, సర్పం చులు చిట్కుల విజయలక్ష్మి, కుమార్ యాదవ్, చెన్నయ్య, యాదగిరి, మాజీ సర్పంచ్లు విష్ణువర్ధన్ రెడ్డి, చిట్కుల భూంరెడ్డి, గోపాల్ రెడ్డి, నేతలు చిట్కుల గోవర్ధన్ రెడ్డి, గం గుమల్ల కొండల్ రెడ్డి, జయ రాంలు గౌడ్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



**వాస్తవం, దౌల్తాబాద్, మార్చి 18:** విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సర్పంచ్ అనురాధ రమేష్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి పోషకాహారంతో కూడిన భోజనం ఎంతో అవసరమని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావాలంటే ఆహారం నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వంటశాలలో పరిశుభ్రత పాటిస్తూ, నాణ్యమైన పదార్థాలతో భోజనం తయారు చేయాలని వంట సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు, నీటి వసతులు, పాత్రల శుభ్రత తదితర పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దుర్గా ప్రసాద్, ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# 76 సంవత్సరాల స్వాతంత్ర భారతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు ఒరగబెట్టింది ఏమీ లేదు

**●దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా రెండవ మహాసభను జయప్రదం చేయండి**

**●దళిత హక్కుల పోరాట సమితి హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవా**

**వాస్తవం:హన్మకొండ**


దళిత హక్కుల పోరాట సమితి రెండవ మహాసభ మార్చి 22 రోజున హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయం బాలసముద్రంలో జరుగును. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే పోతురాజు సారయ్య దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి ఇతర నాయకులు పాల్గొ నను న్నారు, బుధవారం హసన్పర్తి మండల కేంద్ర పరిధిలో ఉన్న నాగారం గ్రామంలో మరియు ముచ్చర్ల గ్రామంలో రెండోవ హనుమకొండ జిల్లా మహాసభ జయప్రదంకై విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవా మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి దాదాపు 76 సంవత్సరాలు గడిచిన కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు ఒరగబెట్టింది ఏమీ లేదు అని ఆయన మండిపడ్డారు. దళితులపై దాడులు ఆగలేదు. దళితులను చంపుతున్నారు కులం పేరుతో దూషిస్తున్నారు అంటరాని తనమని హింసిస్తున్నారు దళితులకు ఉన్నటువంటి ఆస్తులను కూడా లాగేసుకుంటున్నారు ఇవన్నీ జరుగుతున్న కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టలేకపోతున్నాయి అలాంటివి జరగకుండా అరికట్ట లేకపోతున్నాయి విషయాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. ప్రతి రాష్ట్ర ,కేంద్ర బడ్జెట్లో 20 శాతం నిధులను బడ్జెట్లో దళితులకు కేటాయిం చాలని, కేటాయించిన నిధులను పూర్తిగా దళితుల అభివృద్ధికి దళిత సంక్షేమానికి, ఉపయోగించాలని ఆయన కోరారు. దళితులకు కేటాయించిన నిధులను దారి మళ్లిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు ప్రవేట్ రంగాలలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను విడుదల చెయ్యాలని మరియు ఎస్సీ కార్పొరేషన్ లోన్స్ అప్లికేషన్ చేసుకునే విధంగా అవకాశం కల్పించాలని ఆయన తెలిపారు.దళితులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టినటువంటి అంబేద్కర్ హస్తం కింద 12 లక్షల రూపాయలు ఇస్తామని ఇప్పటివరకు అసెంబ్లీలో







తీర్మానం ప్రవేశపెట్టలేదు ఈ అసెంబ్లీ బడ్జెట్లో అంబేద్కర్ హస్తం కింద 12 లక్షల నిధులను ప్రత్యేకంగా దీనికి కేటాయించి దళితుల పక్షపాతిగా ఉండాలని కాంగ్రెస్ పార్టీని ఆయన ప్రత్యేకంగా కోరటం జరిగింది. ఈ కార్యక్రమంలో కుక్కమూడి రాజు. బండారి ఎలేం ద్ర. బండారి వాన. బండారి పూల. బండారి జయ. మేకల రాజయ్య. మట్టెడ గట్టయ్య. చింతం రాజు. మట్టెడ చిరంజీవి. మట్టెడ నవీన్. ఇల్లందుల స్వామి. జన్ను హరి ఈతదితరులు పాల్గొన్నారు.



## బిట్స్‌లో ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు

**వాస్తవం : భూపాలపల్లి**

భూపాలపల్లి కేంద్రంలోని బాలాజీ విద్యా సంస్థలో బుధవారం ముందస్తుగా ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాలయ ఆవరణం పచ్చని మామిడి తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. విద్యార్థులు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా దుస్తులు ధరించి ఉగాది వేడుకకి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస చారి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహనా కలిగి ఉండాలన్నారు. తెలుగు రాష్ట్రాలకు ఆంగ్ల సం వత రం నూతన సంవత్సరం కాదని, ఉగాది మాత్రమే నూతన సంవత్సరం అని మరియు భిన్న మతాలకి నెలవైనా మన దేశం అన్నీ పండగలకి ప్రాముఖ్యతని ఇస్తుందని అలాగే పాఠశాల స్థాయి నుండే అన్ని మతాలకి పండలకి విలువని వ్వాలని, విద్యార్థులకి ఉగాది విశిష్టత గురించి వివరించారు. అలాగే ఉగాది పచ్చడిని స్వీకరించి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఏ ఓ రాజేందర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధిని సమాధి చేస్తున్న మోడీ సర్కార్

**ఉపాధి కార్మికులను ఇబ్బంది పెడుతున్న సిబ్బంది**

**పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పథకాన్ని ఉంచాలి**

**వీబిజీ రామోజీ పేరుతో తెచ్చిన చట్టాన్ని రద్దు చేయాలి**

**జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్**

**భూర్గంపాడు : వాస్తవం**

మాహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనిని ఉపాధి కార్మికులకి అందకుండా దొరకకుండా అంబానీకి ఆదానీలకు దగ్గరకు చేరువయ్యే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు ఉపాధి పనిని సందర్శిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. కోయగూడెం పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి కార్మికుల ని సందర్శించారు రెండు ఫోటోలు పేరుతో మధ్యాహ్నం రెండింటి దాకా ఉంచుతున్నార ని యాప్ డౌన్లోడ్ కావడం లేదని నెట్టు అందుకోవటం లేదని అనేకమైన ఇబ్బందులకు



గురవుతున్న ఉపాధి కార్మికులు ఎర్రటి ఎండలో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.పాత పద్ధతిలోని ఉపాధి పని ఉంచాలని విబి జి రామోజీ పేరుతో తెచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని అదే విధంగా 600 రూపాయలు రోజు కూలి ఇవ్వాలని అన్నారు పని దొరక్క చేసిన పనికి డబ్బులు రాక అనేక ఇబ్బందులతో ప్రజలు తల్లడిలుతున్నారు కానీ యుద్ధం పేరుతో గ్యాస్ 62 రూపాలు పెంచారని ఇది సామాన్యుడు కొను క్కో లేని పరిస్థితి అంతే కాకుండా గ్యాస్ ధర పెరిగిందని హోటల్ మొత్తం మూతపడుతున్నాయని కట్టెలు కూడా దొరకటం లేదని ఈపరిస్థితి మోడీ నిర్వాకం వల్లే జరిగిందని తెలిపారు.అమెరికాకు లొంగు పోయి దాసోహం అంటూ భారతీయుల ప్రయోజనాలను వారికి ప్రాణంగా పెట్టారని అన్నారు.ఆదివాసీలను అడవుల నుంచి వెళ్ళగొట్టి మొత్తం భూభాగాన్ని దోపిడీకి అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నారని గిరిజనలు అంబానీలతో అధానిలతో పోరాడాల్సి వస్తుందని వివరించారు.అడవుల్లోనే కొండలు నీళ్లు గనులు ఇనుము అల్యూమినియం యురేనియం బొగ్గు వాటన్నిటిని స్వాధీనం చేసుకుంటున్నారని దీనికి గిరిజనులు అడ్డంగా ఉన్నారని మావోయిస్టులు వారికి అండగా ఉన్నారనే కారణంతో ఆపరేషన్ కగార్ పేరుతో వారిని చంపేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మడకం రామయ్య బంగారమ్మ తిరుపతమ్మ రమణ రాజేశ్వరి కుంజా లక్ష్మి సావిత్రి పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190
వాస్తవం

# ఘనంగా శ్రీరామచంద్ర స్కూల్ 14వ వార్షికోత్సవం

**విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే పాఠశాల ప్రత్యేకత**

**వ్యవస్థాపకులు డి కృష్ణమోహన్**

**చర్ల : వాస్తవం**




మండల పరిధిలోని ఆర్ కొత్తగూడెం గ్రామంలో శ్రీ రామచంద్ర(కే యం) స్కూల్- 14వ వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు డి కృష్ణ మోహన్ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి పరిటాల వెంకటరమణ హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి ఘనంగా ప్రారంభించారు. శ్రీరామచంద్ర పాఠశాల 14వ వార్షికోత్సవం బుధవారం పాఠశాల మైదానంలో ఘనంగా జరిగింది. విద్యార్థుల స్వాగత నృత్యాలతో అతిథులు, తల్లిదండ్రులను ఆహ్వానించారు. పాఠశాల కరస్పాండెంట్ డి కష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతికం, సైన్స్ ఎక్స్‌పో, ఒలింపియాడ్‌లలో ప్రతిభ చూపేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ పరిటాల వెంకటరమణ మాట్లాడుతూ చిన్నారులను ఆల్‌రౌండర్లుగా తీర్చిదిద్దడం అభినందనీయమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకి సమయం కేటాయించాలని, పిల్లల కోసం తల్లిదండ్రులు సమయాన్ని త్యాగం చేయాలని, పిల్లలతో ఎక్కువ సమయం గడిపి నైతిక విలువలు నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు , గొట్టుముక్కల సీతారామ రాజు, ఎడారి శ్రీను, కూరపాటి వీర్రాజు గ్రామ ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

# సెలెస్టియల్ హై స్కూల్‌లో ఘనంగా ముందస్తు ఉగాది సంబరాలు

**వాస్తవం : సిరిసిల్ల**



సిరిసిల్ల పట్టణంలోని అశోక్‌నగర్‌లోని సెలెస్టియల్ హై స్కూల్‌లో కరస్పాండెంట్ బుర్ర రాధాకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరంను పురస్కరించుకుని ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, సమిష్టిగా బ్రహ్మదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీపి, కారం, చేదు, ఉప్పు, వగరు, పులుపు అనే షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసిన ఉగాది పచ్చడి, భక్షాలు, పులిహోరలను నైవేద్యంగా సమర్పించారు. అలాగే పంచాంగ శ్రవణం కార్యక్రమం కూడా నిర్వహించారు. తరువాత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉగాది పచ్చడి సేవించి, భక్షాలు, పులిహోరను ఆనందంగా ఆస్వాదించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బుర్ర రాధాకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ..... యుగాది అంటే యుగానికి ఆది, అంటే ఒక కొత్త యుగం ప్రారంభమని అర్థంఅని అన్నారు. ఇది నూతన తెలుగు సంవత్సర ఆరంభాన్ని సూచించే పర్వదినమని తెలిపారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు- తీపి (చెరకు), కారం (మిరియాలు), చేదు (వేపపువ్వు), ఉప్పు (ఉప్పు), వగరు (మామిడికాయ), పులుపు (చిం తపండు)---మన జీవితంలోని ఆనం దం, బాధ, కోపం, భయం, ఆశ్చర్యం, విచారం వంటి భావోద్వేగాలను సూచిస్తాయని పేర్కొన్నారు. జీవితం లో సుఖ దుఃఖాలను సమానంగా స్వీకరించాల్సిన అవసరాన్ని ఈ పండుగ తెలియజేస్తుందని అన్నారు. అలాగే ఉగాది సందర్భంగా ఇళ్లను శుభ్రపరచి, ముగ్గులతో అలంకరించి, కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పచ్చడి సేవిస్తూ ఆనందంగా పండుగను జరుపుకోవడం తెలుగువారి సంప్రదాయమని పేర్కొన్నారు. ఈ పండుగ తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మచ్చ ఇందిర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**334 కొనుగోలు కేంద్రాల ద్వారా యాసంగి ధాన్యం కొనుగోలు**

**డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి 2 కోట్ల 18 లక్షల వసూళ్లు**

**వాస్తవం : పెద్దపల్లి జిల్లా ప్రతినిధి**

బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ పని తీరుపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,యాసంగి 2025-26 సీజన్ కు సంబంధించి దాదాపు 4 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 334 సెంటర్ల ద్వారా కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని,కోటి 12 లక్షల 59 వేల గన్నీ సంచులు మనకు అవసరం అవుతాయని ,కొనుగోలు సెంటర్‌లలో మౌలిక సదుపాయాల కల్పన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2024-25 వానాకాలం సంబంధించి 100 శాతము యాసంగీ సంభందించి 93 శాతము,2025-26 వాన కాలము సంబంధించి 28 శాతము సీఎం ఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) పూర్తయిందని అన్నారు. 2014-15 నుండి 2023-24 సంవత్సరములకు సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బకాయి పడిన 48 రైసు మిల్లులు గుర్తించి గత పది రోజులలో 2 కోట్ల 18 లక్షల రూపాయలు డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుండి వసూలు చేయడం జరిగిందని అన్నారు. పెండింగ్ బాకాయిలు త్వరితగతిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల చెల్లించాలని,లేని యెడల డిఫాల్ట్ రైస్ మిల్లర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 5 రైస్ మిల్లులపై క్రిమినల్



కేసులో నమోదు చేసి రెవెన్యూ రికవరీ చట్టం అమలు చేయడం జరిగిందని, మిగిలిన మిల్లులపై కూడా తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కే. శ్రీనాథ్,జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం. శ్రీకాంత్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**వాస్తవం ఎఫెక్ట్**

## అనుమతి లేని నిర్మాణాన్ని తొలగించిన అధికారులు




నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

**వాస్తవం:ఆందోల్**

వాస్తవంలో వచ్చిన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లే దారి కబ్జా చేసిన పట్టించుకోరా అనే కథనానికి స్పందించిన అధికారులు బుధవారం నాడు నిర్మాణాన్ని తొలగించారు. అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని అందోల్ చెరువు ప్రాంతంలో 17 14 సర్వే నెంబర్లు బఫర్ జోన్ లోఅక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణ పనుల పిల్లర్ పుట్టింగ్లను ఇరిగేషన్ మున్సిపల్ అధికారులు తొలగించేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్ టి ఎల్ లోఅనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఇరిగేషన్ అధికారి నాగరాజులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉగాది వేడుకలు



**వాస్తవం: ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిపేటలో ఇంచార్జి ప్రధానో పాధ్యాయులు గరుగుల స్వామి. అధ్యక్షతన ముందస్తు ఉగాది వేడుకలు జరుపుకున్నారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు అజ్మీరా భీక్కు నాయక్, నర్ర అంజన్ రెడ్డి, న్యాత రమేష్. ఆధ్వర్యంలో.. పిల్లలకు తెలుగులో సంవత్సరాలపేర్లు, నెలల పేర్లు, పద్యపఠనం, తెలుగులో భాషణం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, ఎనగందుల శంకర్, శ్రీమతి సాధు శైలజ, చిట్టి శ్రీకాంత్, దరిపెల్లి శ్రీనివాస్, తుమ్మల మధుసూదన్, నునావత్ రాజు, స్తంభంపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పిల్లలు సాంప్రదాయ దుస్తులలో ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమం అందరినీ ఆకర్షించింది. పిల్లలకు ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. పిల్లలు తెచ్చిన తీపిపదార్థాల రుచులు అందరిని అలరించాయి.

## ఆసరా పెన్షన్లు పెంచాలి

**పెద్దపల్లి సత్యనారాయణ**

**వాస్తవం : జైపూర్**



తెలంగాణ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు వికలాంగుల వృ ద్ధుల వితంతుల ఒంటరి మహిళల ఆసరా పెన్షన్లు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చెర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ తెలియచేశారు. వికలాంగులకు 6000 రూపాయలు వృద్ధులు వితంతులు ఒంటరి మహిళలు మిగతా ఆసరా పెన్షన్లు 4000 రూపాయలు పెంచి బడ్జెట్ లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వికలాంగులకు బస్సులలో పూర్తి రాయితీ కల్పించాలి. విద్య ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. నిరుద్యోగ వికలాంగులకు ప్రభుత్వం ప్రత్యేక ఉపాధిని చూపించాలన్నారు.

# కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజల పాలిట శాపాలు

### తోకల శ్రీనివాసరెడ్డి

వాస్తవం : రాజేంద్రనగర్

కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజల పాలిట శాపంగా మారాయని బిజెపి పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ రాష్ట్ర నాయకత్వ పిలుపు మేరకు రాజేంద్రనగర్ మండల ఎమ్మార్వో కార్యాలయం ముందు బిజెపి పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ప్రజా వ్యతిరేక పాలన కాకుండా ప్రజా పాలన అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఎమ్మార్వో బొమ్మ రాములకు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలు గాలిలో ఆవిరైపోయాయని ఎద్దేవా చేశారు. రైతులు, యువత, మహిళలు, వితంతువులు, దివ్యాంగులు



ఇలా అన్ని వర్గాల ప్రజలు హరి గోస పడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. పేదలకు ప్రభుత్వం ప్రకటించిన గృహ నిర్మాణ పథకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి



### సిహెచ్. వీరేష్

వాస్తవం : మంచిర్యాల

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరాకరించాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ సంస్థ సహాయ పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి సిహెచ్. వీరేష్ పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్.కె.ఎం. డి.ఈడ్ కళాశాలలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో "సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్"పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి, నీరు, జీవవ్యవస్థలకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు.రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయాలను వినియోగించాల్సిన అవసరాన్ని వివరించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.కార్యక్రమం ముగింపులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉగాది శుభాకాంక్షలు తెలిపిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

వాస్తవం : జూబ్లీహిల్స్

ఉగాది తెలుగువారి నూతన సంవత్సరాది. ఇది చైత్ర శుద్ధ పాడ్యమినాడు వస్తుంది. ఈరోజుని బ్రహ్మ దేవుడు ప్రారంభించాడని నమ్మకం. వసంత ఋతువు మొదలవుతుందని నమ్ముతారు. ఉగాది పచ్చడి,పంచాంగ శ్రవణం ఈ పండుగలో ప్రధాన ఆచారాలు. అటువంటి ఆచారాన్ని ప్రజలందరూ కొనసాగించాలని కోరుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎం.ఎల్.ఎ. వి. నవీన్ యాదవ్ గురువారం(19/3/2026) జరుపుకోబోయే ఉగాది పండుగ సందర్భంగా ప్రజలందరికి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వి.నవీన్ యాదవ్ మాట్లాడుతూ వేప పూత ( చేదు, బాధ), బెల్లం ( తీపి, ఆనందం), మామిడి మొక్కలు ( వగరు,కొత్త అనుభూతులు ), చింతపం డు ( పులుపు, జాలి ), ఉప్పు ( రుచి), కారం( ఆగ్రహం) వ ంటి ఆరు రుచుల పండుగ



అయిన ఉగాది మన జీవితంలోని కష్టసుఖాలకు దగ్గరగా సంబంధం ఉండే పండగ ఉగాది అని అన్నారు.

# అపరిష్కృతంగా కల్వర్టు నిర్మాణం

### ప్రజలకు తప్పని ఇబ్బందులు

వాస్తవం : హుస్నాబాద్

అపరిష్కృతంగా కల్వర్టు నిర్మాణాలు చేపట్టడం వల్ల నీరు నిల్వ ఉండి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. బుధవారం రామవరం రోడ్డులో గల కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలించారు. కల్వర్టు నిర్మాణం కోసం తవ్వడం వల్ల అందులో నీరు చేరి దుర్గంధం వ్యాప్తిస్తుందని, దీంతోపాటు దోమలకు ఆవాసాలుగా నెలకొని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. నిత్యం రోడ్డుపై వెళ్లే పాదచారులకు, ద్విచక్ర వాహనదారులకు దుర్గంధం వ్యాపిస్తుందని మున్సిపల్



అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం ఎంత వరకు సమంజసం అన్నారు. కనీసం మున్సిపల్ అధికారులు సదరు కాంట్రాక్టర్ పై ఒత్తిడి ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు? పట్టణంలో నిర్మాణాలు ఎక్కడ జరిగినా కూడా అపరిచికృతంగా ఉండటమే తప్ప తొందరగా పూర్తి చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అపరిష్కృతంగా ఉన్న కల్వర్టు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, వచ్చి పోయే వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీష్, నాయకులు యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, కందుకూరి సతీష్ పాల్గొన్నారు.

# లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి

### వ్యవసాయం, విద్య, గృహ నిర్మాణం, మహిళా సంఘాలకు, ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు రుణాలు మంజూరు చేయాలి

### జిల్లాస్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలని రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ చైర్ పర్సన్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జిల్లాస్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ, గృహ, విద్య రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్వానిధి అమలు, పురోగతి





పై బ్యాంకుల వారీగా సమీక్ష చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ....జిల్లాలోని బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. వ్యవసాయ, విద్య, ఇతర రుణాల లక్ష్యం 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణాలకు రుణం ఇవ్వాలని ఆదేశించారు. బ్యాంక్ లో వినియోగంలో లేని ప్రభుత్వ ఖాతాల వివరాలు తెలుపాలని, కేవైసీ అప్డేట్ చేయించాలని సూచించారు. ఆర్ సేతీ ఆధ్వర్యంలో ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారో ఆరా తీశారు. వివిధ శాఖలు, పరిశ్రమలకు ఉపయోగపడే శిక్షణ ఇవ్వాలని, స్వయం ఉపాధి పొందేలా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాలపై సమీక్ష చేశారు. మహిళలు తీసుకుంటున్న రుణాలతో స్వయం ఉపాధికి ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.బ్యాంక్ లలో అందించే సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని, ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈసమావేశంలో ఎల్ డీ ఎం మల్లికార్జున రావు, ఆర్ బిఐ ఏజీఎం రాములు సబావత్, నాబార్డ్ డీడీఎం దిలీప్, యూబీఐ ఏజీఎం సురేష్ కుమార్, టీజీబీ ఆర్ ఎం రాజ నరేంద్ర, డీఆర్ డీఓ గీత,డివి హెచ్ ఓ రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఆయా బ్యాంకుల ప్రతినిధులు,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం




## డా. అనిత

వాస్తవం : మంచిర్యాల

గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నియంత్రణ లింగ ఎంపిక నిషేధ చట్టం-1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, అడగడం చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత స్పష్టం చేశారు.నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల పర్యవేక్షణ, అల్ట్రాసౌండ్ యంత్రాల తనిఖీలు, రికార్డుల నిర్వహణ, సి-సెక్షన్ ఆడిట్, అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ప్రతి స్కానింగ్ కేంద్రంలో సంబంధిత చట్ట పుస్తకాలు, సేవల వివరాలు ప్రదర్శించాలని, గర్భిణీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కొత్త స్కానింగ్ యంత్రాల కొనుగోలుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని, పాత యంత్రాల తొలగింపుకు కూడా అధికారిక అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు.భ్రూణ హత్యల నివారణకు కమిటీ సభ్యులంతా సహకరించాలని పిలుపునిచ్చారు. లోపాలు ఉన్న స్కానింగ్ కేంద్రాలకు మెమోలు జారీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, అధికారులు, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పంచాంగాల పంపిణీ



వాస్తవం : దౌల్తాబాద్

దౌల్తాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పంచాంగాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం సభ్యులు పంచాంగాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ పంచాంగం హిందూ సంప్రదాయాలలో ఒక ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. పండుగలు, ఉపవాసాలు, శుభ ముహూర్తాలు, గ్రహణాలు వంటి వివరాలు పంచాంగంలో సమగ్రంగా ఉంటాయని, ప్రతి కుటుంబంలో పంచాంగం ఉండటం వల్ల ఆచారాలను సులభంగా పాటించవచ్చని తెలిపారు. పంచాంగం ఆధారంగా శుభకార్యాలు నిర్వహించడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చని వారు సూచించారు.అలాగే నేటి వేగవంతమైన జీవితంలో కూడా సంప్రదాయాలను మరవకుండా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సంఘ సభ్యులు అభిప్రాయపడ్డారు. యువతలో సాంప్రదాయాలపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్యదర్శికి గ్రామ ప్రజల పిర్యాదు



వాస్తవం : చెన్నూర్ ఆర్ సి

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఆలుగామ గ్రామ పంచాయతీ కార్యదర్శి కి గ్రామంలోని సమస్యపై గ్రామ ప్రజలు పిర్యాదు చేశారు.గ్రామపంచాయతీ నర్సరీ కోసం ప్రభుత్వం నుండి వచ్చిన సిన్టెక్స్ (పెద్ద వాటర్ ట్యాంక్) ను ఎవరో దొంగిలించారని,అలాగే శ్మశాన వాటిక దగ్గర సోలార్ లైట్ కనిపించడం లేదని వీటిని రికవరీ చేయాలని గ్రామస్థులు అందరూ ఏకమై కార్యదర్శికి లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కార్యదర్శి గ్రామ పంచాయతీ సొమ్మును ఎవరు దౌర్జన్యంగా వాడుకున్న చట్ట ప్రకారం శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.గ్రామ పంచాయతీకి వచ్చిన ప్రతి సొమ్ము ప్రజలందరిదని ఎవరు నాశనం చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొండగుర్ల అంకన్న, మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంబరి సజన్ కుమార్, పల్లె వెంకటయ్య, పల్లె సత్తయ్య, కుమ్మరి వెంకటి, లచ్చిమల్లు, ప్రభాకర్, చెంద్రయ్యా, బ్రహ్మయ్య,శ్రీనివాస్,భీమయ్య, బేడిక వేంకటి,పున్నం, సోమయ్య,సమ్మయ్య, రామయ్య,రామటేంకి సమ్మయ్య, పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
JSS JOURNALISTS SANKSHEMA SANGAM
Red 914/2015
జర్నలిస్ట్ల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం।। 9618616110

# పారిశుద్ధ్య పనులను సమీక్షించిన జోనల్ కమిషనర్



వాస్తవం : రాజేంద్రనగర్

రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని అత్తాపూర్ సర్కిల్లో పారిశుద్ధ్య పనులను జోనల్ కమిషనర్ మండా మకరందు సమీక్షించారు. బుధవారం ఆయన సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య, డీఈఈ తిరుపతి, ఏఈఈ ఆశిష్ తివారి తో కలిసి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. పీవీఎన్ ఆర్ ఎక్స్ప్రెస్ వే పరిధిలోని ముఖ్య ప్రాంతాలను పరిశీలించారు. వీధుల పరిశుభ్రత లో భాగంగా పారిశుద్ధ్య కార్యకలాపాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. పీవీ ఎక్స్ ప్రెస్ వే ఫ్లైఓవర్ పై పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచనలు చేశారు. రహదారుల వెంట పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలు, కూల్చివేత వ్యర్థాలు తక్షణమే తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని జోనల్ కమిషనర్ తెలిపారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచుతూ పబ్లిక్ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపానికి తావు లేకుండా సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య పనులు జరగాలని అన్నారు.

# షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు



వాస్తవం : మంచిర్యాల

జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక పురోగతిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకు లు చాతరాజుల దుర్గాప్రసాద్ తెలిపారు.రవాణా రంగంలో ఈవీ 2 వీలర్కు 90 శాతం సబ్సిడీ, 10 శాతం బ్యాంకు రుణంతో సుమారు రూ.1 లక్ష యూనిట్ ధరకు 185 యూనిట్లు, ఈవీ త్రిచక్ర వాహనాలకు 70 శాతం సబ్సిడీ, 30 శాతం రుణంతో రూ.3 లక్షల యూనిట్ ధరకు 91 యూనిట్లు అందించనున్నట్లు తెలిపారు.వ్యవసాయ రంగంలో సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ వంటి పథకాల కింద 60 శాతం సబ్సిడీ, 40 శాతం రుణంతో రూ.3 లక్షల నుండి రూ.7 లక్షల వరకు 19 యూనిట్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా పథకాల కోసం), పట్టాదారు పాస్‌బుక్, ఇతర సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించాలని తెలిపారు. వ్యవసాయేతర పథకాలకు 21--50 సంవత్సరాలు, వ్యవసాయ పథకాలకు 21--60 సంవత్సరాల వయోపరిమితి ఉంటుందని వివరించారు.అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24లోపు వాదీవీమీ పోర్టల్‌లో నమోదు చేసుకుని, దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసి అవసరమైన పత్రాలతో నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.అర్హత గల యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## రాజన్న ఆలయంలో మహిళా సిబ్బందికి చీరల పంపిణీ



వాస్తవం : వేములవాడ

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో పని చేస్తున్న మహిళా సిబ్బందికి, ఫోర్ క్లాస్ ఉద్యోగులకు ఆలయ ముఖ్య కార్యాచరణ అధికారి ఎల్ రమాదేవి ఆలయం తరపున రెండు చీరలను బుధవారం పంపిణీ చేశారు.ప్రతి సంవత్సరం ఒకసారి నిర్వహించే ఈ కార్యక్రమం ఆలయంలో కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా కొనసాగుతోంది. మహిళా సిబ్బంది సంక్షేమం దృష్ట్యా ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉగాది సంబరాలు

వాస్తవం : వేములవాడ

వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం తెలుగు నూతన సంవత్సరపు ఉగాది పండుగ ను ముందస్తు వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అందరికీ భక్షాలు, ఉగాది పచ్చడి అందించారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూహిక ఉగాది సాంప్రదాయక భోజనం చేశారు.తదుపరి పంచాంగ శ్రవణాన్ని విద్యార్థి చే చెప్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ....ఉగాది తెలుగువారి సాంప్రదాయ నూతన సంవత్సరాది అని, చైత్ర శుద్ధ పాడ్యమి నాడు (వసంత రుతువు ప్రారంభంలో) బ్రహ్మదేవుడు సృష్టిని ఆరంభించాడని, నమ్మకమని, అందుకే ఈ పండుగకు చాలా విశిష్టత ఉందని, షడ్రుచుల ఉ



గాది పచ్చడిని తీసుకోవడం, పంచాంగ శ్రవణం చేయడం, కొత్త పనులు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దుర్శెట్టి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఈడుగు లక్ష్మి, యదులపురపు స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందు బాబులకు జరిమానాలు

### మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు,తస్మాత్ జాగ్రత్త

### వేములవాడ పట్టణ సిఐ వీరప్రసాద్

వాస్తవం : వేములవాడ

వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 49 మంది మందు బాబులు పట్టుబడగా వారిని వేములవాడ పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా 35 మందికి 2000 రూపాయల జరిమాన,14 మందికి 4000 రూపాయల జరిమానాలు విధిస్తు వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు.వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన మందు బాబులకు పట్టణ సిఐ వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ వీరప్రసాద్



మాట్లాడుతూ...ప్రతి రోజు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించాడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి వారి తల్లి తండ్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌ న్సెల్లింగ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు.మ ద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశాలకు పోలీ స్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతాయని,ట్రాఫిక్, రోడ్ భద్ర త నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వెంగళరావు చెరువులో సరైన నీరు లేక చేపలకు మృత్యు వాత



### మత్స్యకారులకు నష్టం

వాస్తవం : చందుర్తి

చందుర్తి మండలం మల్యాల గ్రామ శివారులోని వెంగళరావు చెరువులో సరైన నీరు లేకపోవడంతో చేపలు మృత్యువాతకు గురయ్యాయి.మత్స్యకారులు ప్రభుత్వ సబ్సిడీతో పెంపకం చేసిన చేపలు చెరువులో నీటిమట్టం తగ్గడంతో చేపలు పట్టేందుకు ముందే చనిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంతో జోగాపూర్ సంప్ హౌజ్ ద్వారా చందుర్తి రిజర్వాయర్ నుండి మల్యాల వెంగళరావు చెరువుకు నీరు రావకపోవడంతో జీవనాధారంగ బ్రతుకుతున్న మత్స్యకారులు చేపలు చనిపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులు బుధవారం వెంగళరావు చెరువుకు చేపలు పట్టేందుకు వెళ్లేసరికి మృతి చెందడంతో ద్రిగ్భాతి గురయ్యారు. చెరువులోకి నీరు వస్తే చేపలు బ్రతికి ఉండేవని మత్స్యకారులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చెరువులోకి నీరు నింపాలని కోరుతున్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ

వాస్తవం : వేములవాడ

వేములవాడ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముస్లిం సోదర సోదరీమణులకు బుధవారం రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మామిడిపల్లి సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి , పార్టీ నాయకులు పాల్గొని లబ్ధిదారులకు తోఫాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ....పండుగల సందర్భాల్లో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం కుటుంబాలకు అవసరమైన సరుకులతో కూడిన తోఫాలు అందజేయడం సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్ లు, ఉప



సర్పంచులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, జిల్లా, మండల స్థాయి నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జామే మస్జిద్‌లో ఇఫ్తార్ విందు



వాస్తవం : వేములవాడ

వేములవాడ పట్టణం లోని ఉప్పుగడ్డ జామే మస్జిద్‌లో బుధవారం సాయంత్రం యువకులు పవిత్ర రంజాన్ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ఇఫ్తార్ విందును నిర్వహించారు.సోహెల్ ఖాన్ ,ఫరీద్ బాబా, వారి ఆయన్, సమీర్, బాబా, అబుసుఫియాన్, ఫైజాన్, అంకూష్.ఇబ్రహీం, అమన్ షేక్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్ లు ముస్లిం సోదరుల ఉపవాసం ఉన్న భక్తులందరు నమాజ్ చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జామే మస్జిద్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. .. యువత సేవా మార్గంలో నడవడం తమకు గొప్ప సంతృప్తిని ఇస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అబ్దుల్ రజాక్, మాజీ కో –ఆప్షన్ సర్వర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రంపేట పాఠశాలలో ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్

వాస్తవం : సిరిసిల్ల

ప్రజాపాలనా –ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిరిసిల్ల ఫైర్ స్టేషన్ అధికారి నర్మెట్ట నరేందర్ ఆధ్వర్యంలో తమ అగ్నిమాపక సిబ్బంది గణేష్, శశిధర్, శివకుమార్ లతో కలిసి అగ్ని ప్రమాదాల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సిరిసిల్ల ఫైర్ స్టేషన్ అధికారి ఎన్ నరేందర్ అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు విద్యార్థులకు వివరించారు.అనంతరం ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఫైర్ స్టేషన్ అధికారి నరేందర్,ఫైర్ సిబ్బంది గణేష్, శశిధర్, శివకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కైరి పద్మ, ఉపాధ్యాయ బృ





ందం కొండికొప్పుల రవి, వోద్యారాం మధుసూధన్,ముంజ రమ,లత,త్రివేణీ,విద్యార్థులు పాల్గొన్నారు.

# మర్రిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది సంబురాలు

వాస్తవం : చందుర్తి

చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగ శుభాకాంక్షలు ఒకరికొకరు ఉగాది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉగాది పచ్చడిని తయారు చేసి, సేవించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉగాది పండుగ ప్రత్యేకత, సంప్రదాయాల గురించి తెలిపారు. ఉగాది తెలుగు ప్రజల కొత్త సంవత్సర ప్రారంభ పండుగ. ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో ఎంతో ఆనందంగా జరుపుకునే పండుగ. చైత్ర మాస శుక్ల పక్షం మొదటి రోజున ఉగాది వస్తుంది. ఈ రోజు నుండి కొత్త సంవత్సరం ప్రారంభమవుతుందని, యుగాది అంటే కొత్త యుగం ప్రారంభం అనే అర్థం. ఈ రోజున ప్రజలు కొత్త ఆశలు, లక్ష్యాలతో జీవితాన్ని ప్రారంభిస్తారని,ఉగాది రోజున ప్రత్యేకంగా ఉగాది పచ్చడి తయారు చేస్తారు. ఇందులో వేపపువ్వు , బెల్లం ,మామిడి ముక్కలు ,చింతపండు ,ఉప్పు కారం ,ఈ ఆరు రుచులు జీవితంలోని ఆనందం, దుఃఖం, కోపం, ఆశ్చర్యం, భయం, చేదు అనుభవాలు అన్నింటినీ సూచిస్తాయని, ఉగాది మన జీవితంలో కొత్త ఆశలు, కొత్త ఆరంభాలు తీసుకొచ్చే పండుగ. అందుకే తెలుగు ప్రజలు ఈ





పండుగను ఎంతో భక్తితో ఆనందంతో జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వినయ్ కుమార్ తో పాటు ఉపాధ్యాయులు గంగ నర్సయ్య, వేణుగోపాల్, కనకయ్య, సావిత్రి, జ్యోతి రాణి, సరోజ, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు. సనుగులలో అలాగే చందుర్తి మండలంలోని సనుగుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండగ ఉత్సవాలు షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేసి పిల్లలకు అందిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలతో రంగవల్లులతో పంచాంగ శ్రవణాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కటుకూరి ముఖేష్ మాట్లాడుతూ ....మన తెలుగువారు అత్యంత ముఖ్యమైనది. ఉగాది పండగ సందర్భంగా తెలుగు నూతన సంవత్సరారంభాన్ని సూచించే పర్వదినమని, ఇది వసంత ఋతువు ఆరంభాన్ని సూచిస్తూ, కొత్త ఆశలు, లక్ష్యాలు, సంతోషాలను తీసుకొస్తుందని ఈ పర్వదినం సందర్భంగా ప్రజలు ఇళ్లను శుభ్రపరచుకొని, రంగవల్లులు వేస్తారని పచ్చడి ఉగాది పచ్చడి తయారు చేసి, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్ట్ అధికారిని కవిత, గ్రామపంచాయతీ సర్పంచ్ బొడిగె లావణ్య -అనిల్, ఉపసర్పంచ్ శెనిగరపు స్వామి, పంచాయతీకి సెక్రెటరీ కన్నం అనిల్, ఐసిడిఎస్ అధికారిని శంకరమ్మ, యాదగిరి, ఉపాధ్యాయులు మేకల పద్మ, కోరెపు శ్రీనివాస్,నాతరి నాగమణి,చింతల హరిష్మ,అంగన్ వాడి ఉపాధ్యాయులు అయేషా,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బాధితుల వద్దకే ఆన్ సైట్ మెంట్ ఎఫ్ఐఆర్ ద్వారా కేసుల నమోదు

**సంఘటనా స్థలంలోనే ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్**

**జిల్లాలో ఇప్పటివరకు 12 కేసులు నమోదు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**

వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)

ప్రజలకు మరింత వేగవంతమైన, సౌకర్యవంతమైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ కీలక ముందడుగు వేసిందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు.రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వారి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే ఆన్ సెట్ మెంట్ ఎఫ్ఐఆర్ విధానాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు.నేరం జరిగిన తరువాత శారీరకంగా,మానసికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం ఒక భారంగా మారకూడదనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సౌకర్యాలు పోలీస్ స్టేషన్లలో ఈ విధానం అమలులో ఉందని తెలిపారు.ఇప్పటికే ఈ విధానం ద్వారా జిల్లాలో 12 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల వద్ద నుంచే ఫిర్యాదును స్వీకరిస్తారని,ఫి



ర్యాదుదారులు డయల్ 100కు కాల్ చేసినా, నేరుగా సమాచారం ఇచ్చినా వెంటనే స్పందించి ట్యాబ్ ల ద్వారా ఆన్ లైన్ లో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని,రోడ్డు ప్రమాదాలు,గొడవలు వంటి ఘటనల్లో గాయపడిన వారికి తక్షణ వైద్యసాయం అందిస్తూ ఆసుపత్రికి తరలిస్తారని,ఈ ఆన్ సెట్ మెంట్ ఎఫ్ఐఆర్ విధానం ద్వారా రోడ్డు ప్రమాదాలు, గొడవలు, దొంగతనాలు, భార్యాభర్తల వివాదాలు, వేధింపులు, అనుమానాస్పద మృతులు వంటి కేసులను సంఘటనా స్థలంలోనే తక్షణం నమోదు చేసే అవకాశం కలుగుతుందని, ఈ విధానం ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందించడమే కాకుండా, పోలీస్ సేవలపై ప్రజల నమ్మకం మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు.

# పాఠశాలలో '99 రోజుల వైద్య ఆరోగ్య శిబిరం'



వాస్తవం : ముప్కాల్

ముప్కాల్ కేజీబీవీ పాఠశాలలో బుధవారం రోజు ఉదయం '99 రోజుల వైద్య ఆరోగ్య శిబిరం' చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం 178 బాలికలకు గాను కంటి పరీక్షలు 12, డేంటల్ స్క్రీనింగ్ 25, చిన్న పిల్లల సమస్యల స్క్రీనింగ్ 21 ఇలా మొత్తంగా 58 విద్యార్థినిలకు తాత్కాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నట్టుగా గుర్తించడం జరిగిందని డాక్టర్ రవి శంకర్ తెలిపారు. అదేవిధంగా సీపీఆర్ గురించి అవగాహన కల్పించారు. జిల్లా వైద్యాధికారిని రాజశ్రీ ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ సతీష్, డాక్టర్ మద్దుల రాకేష్, కంటి పరీక్షా నిపుణులు డాక్టర్ గురురాజు, పాఠశాల ఎస్వో వినోద, ఆర్పీఎస్కే సిబ్బంది మురళి, వనమాల, స్టాఫ్ నర్స్ మమత, పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు..

# పొనూరు గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డి పి ఓ

వాస్తవం : జైపూర్

మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వర్ రావు ఆకస్మికంగా జైపూర్ మండలం లోని పౌనూర్ గ్రామపంచాయతీ ని సందర్శించడం జరిగినది. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేయడం జరిగినది. గ్రామపంచాయతీ స్టాట్యూటరీ వాటర్ సప్లై రిజిస్టర్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచనలు జారీ చేయడం జరిగినది. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలో ని రోడ్లు మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అదేవిధంగా రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఉండకుండా చూసుకోవాలని ఆదేశించడం జరిగినది.గ్రామ పంచాయతీలో జరుగుతున్నటువంటి పారిశుద్ధ్య పనులను



పర్యవేక్షించడం జరిగినది, గ్రామపంచాయతీ సెగ్రిగేషన్ షెడ్ ని సందర్శించి గ్రామపంచాయతీ నుండి సేకరిస్తున్నటువంటి తడి పొడి చెత్తను వేరు చేయాలని తడి చెత్తతో ఎరువు తయారు చేయాలని అదేవిధంగా పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్డు పంపే విధంగా చూడాలని ఆదేశించడం జరిగినది. అనంతరం స్మశాన వాటికను సందర్శించి చుట్టూ ఎటువంటి పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలని ఆదేశించడం జరిగినది. గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండడంపై పంచాయతీ కార్యదర్శి పైన ఆగ్రహం వ్యక్తం చేసినారు.ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమం లో సానిటేషన్ పనులు ముమ్మరంగా చేయించాలని చెప్పడం జరిగింది.ఈ రోజు జిల్లా పంచాయితీ అధికారి పౌనూర్ గ్రామపంచాయతీ లోని ప్రైమరీ పాఠశాల లో కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మాణానికి మార్కౌట్ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమం లో మండల పంచాయితీ అధికారి శ్రీపతి బాపు రావు,ఏ. పి. ఓ. బాలయ్య , సర్పంచ్ వేముల సుధా, కార్యదర్శి భాస్కర్,టీ ఏ సంతోష్ పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు,
పదవీ విరమణ
శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190
వాస్తవం


# బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేయాలి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడె చంద్రయ్య



వాస్తవం : అడ్డగూడూరు

బునాదిగాని కాల్వ పనులు వెంటనే చేపట్టి త్వరగా పూర్తి చేసి మండలానికి సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడె చంద్రయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో అడ్డగూడూరు మండల సమితి సమావేశం కామ్రేడ్ సోలిపురం నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి చెడె చంద్రయ్య మాట్లాడుతూ... గురజాల నుండి జానకీపురం వరకు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని, బునాది గాని కాల్వ పనులు త్వరగా చేపట్టి అడ్డగూడూరు మండలానికి సాగునీరు అందించాలన్నారు. గురజాల నుండి జానకిపురం వరకు డబల్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలోని లింకు రోడ్లు త్వరగా పూర్తిచేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. రైతు బంధును వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని, రెండు లక్షల వరకు రుణమాఫీ జరగని రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రేఖల శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు ఉప్పుల శాంతి కుమార్, కంచనపల్లి ఉపసర్పంచ్ బెల్లి శ్రీకాంత్, మండల కౌన్సిల్ సభ్యులు భోనుగ సుదర్శన్ రెడ్డి, చక్క సోమయ్య, చేడే సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో భాగంగా విద్యార్థినులకు క్రీడా పోటీలు

### కబడ్డీ, త్రోబాల్, షాట్‌పుట్, పరుగు పందెం పోటీలు విద్యార్థినుల చురుకుగా పాల్గొన్నారు

### కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం



వాస్తవం : గజ్వేల్ ఆర్ సి

స్థానిక గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 12వ రోజు విద్యార్థినులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం సహకారంతో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రాజారావు ఆధ్వర్యంలో కబడ్డీ, త్రోబాల్, షాట్‌పుట్, పరుగు పందెం పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించడం, శారీరక దృఢత్వాన్ని అభివృద్ధి చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవడం లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు పోటీల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించగా, విజేతలకు అభినందనలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రాజారావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# నెట్ ఫౌండేషన్ సేవలు చిరస్మరణీయం

### డిగ్రీ కళాశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం





వాస్తవం : హుస్నాబాద్

నెట్ ఫౌండేషన్ సేవలు చిరస్మరణీయమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని వి- నెట్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గంగిశెట్టి గాంధీ, స్టేజి కోఆర్డినేటర్ గంగం రజిత, అడ్వైజర్ కోడం రమేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వీ-నెట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్స్ పాల్గొన్న కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ... ఉన్న ఊరుకు సేవ చేయాలనే గొప్ప తలంపుతో అమెరికాలో స్థిరపడ్డ ఎర్రం రఘునందన్ రెడ్డి హుస్నాబాద్ పట్టణంలో 2003 నుండి గొప్ప గొప్ప సేవా కార్యక్రమాలు చేస్తున్నారని గుర్తు చేశారు. వేసవిలో దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో విద్యార్థులకు, ప్రజలకు మంచి నీరు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎల్లమ్మ దేవాలయం తో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా దీని యొక్క జీవితకాల నిర్వహణకు అయ్యే ఖర్చు మొత్తాన్ని కూడా వీ- నెట్ ఫౌండేషన్ భరిస్తుందని చెప్పారు. అలాగే వీ- నెట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం, ముగ్గుల పోటీ లు కూడా గతంలో నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు ప్రజా ఉపయోగార్థం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ... ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వీ- నెట్ ఫౌండేషన్ ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్ ను అందించినందుకు ఫౌండర్ రఘునందన్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఎవరికి వారే తమ తమ పనుల్లో నిమగ్నం అవుతూ సొంత పనులకే పరిమితమవుతున్న ఈ రోజుల్లో విద్యార్థులకు మంచి సేవ చేయాలనే సంకల్పం గొప్పదని, ఇలాంటి సేవా కార్యక్రమాలను విద్యార్థులు జీవితాంతం గుర్తుంచుకుంటారని కొనియాడారు. ఇలాంటి ఆలోచన రావడమే గొప్ప విషయమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ విద్యాలయంలో సీటు సాధించిన ఆల్ఫ్రెడ్ నోబెల్ విద్యార్థి



వాస్తవం : శంకరపట్నం

మండల కేంద్రంలోని ఆల్ఫ్రెడ్ నోబెల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని 5వ తరగతి చదువుతున్న పంజాల ఆద్య నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గుర్రం వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు మ్యాథ్యూస్ బుధవారం పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడారు. ఆమె ప్రవేశ పరీక్షలో 89% మార్కులు సాధించి జిల్లాలోనే 57వ ర్యాంక్ పొందిందని వేలాదిమంది పోటీ పడ్డ పరీక్షలో తమ విద్యార్థిని విజయం సాధించడం ఎంతో ఆనందశీగా ఉందని చెప్పారు. ఆమె కృషికి అంకితభావాన్ని ప్రశంసించారు. ప్రతి విద్యార్థి కష్టపడి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. కేంద్ర విద్యాలయం సీటు సాధించిన ఆద్యను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

# గ్రాడ్యుయేషన్ డే వేడుకలతో విద్యార్థులలో నూతన ఉత్తేజం



### కరస్పాండెంట్ భాస్కర్

వాస్తవం : రాజేంద్రనగర్

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు విద్యార్థుల సాధనలు ప్రతిభను గుర్తించి వారికి నూతన ఉత్తేజాన్ని ఇస్తాయని భానోదయ హై స్కూల్ కరస్పాండెంట్ బి. భాస్కర్ అన్నారు. అత్తాపూర్ సర్కిల్ పాండురంగ నగర్ లోని భానోదయ హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే, కల్చరల్ ఫెస్ట్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ భాస్కర్ మాట్లాడుతూ... ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, ఐదవ తరగతి చెందిన పలువురు విద్యార్థులు చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలలో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, ఆటపాటలు, నాటకాలు ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని అన్నారు. ఇలాంటి వేడుకలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి వారి తదుపరి విద్యా ప్రయాణానికి పునాది వేస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చేసిన సాధనలు, ప్రతిభాపాటవాలను చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గ్రాడ్యుయేషన్ గౌన్లు, టోపీలు ధరించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను కరస్పాండెంట్ భాస్కర్, ప్రిన్సిపల్ భవాని అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఇంచార్జ్ పి. బిహులా రాణి, ఆఫీస్ ఇంచార్జ్ సంతోషిని భట్, ప్రైమరీ ఇంచార్జ్ ఎం. మీనా, హై స్కూల్ ఇన్చార్జ్ భాగ్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## వీర్నపల్లి మోడల్ స్కూల్

# నిర్మాణానికి భూమి పూజ

### సి సి రోడ్డుకి మోక్షం

### సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

వాస్తవం : వీర్నపల్లి

వీర్నపల్లి మండలకేంద్రంలో 10 లక్షల వ్యయంతో నిర్మించే మోడల్ స్కూల్ కి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న-అరుణ్ కుమార్ భూమి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ జోత్స్న-అరుణ్ కుమార్ మాట్లాడుతూ..... బడి బాగుంటేనే ఊరు బాగుంటుందని అన్నారు. మోడల్ స్కూల్ లో కార్పొరేట్ స్థాయిలో విద్య అందుతుందని అన్నా రు. పేద విద్యార్థులు ఈఅవకాశాలను సద్వినియోగం చేసుకొ ని ఉన్నత స్థాయికి ఎదుగేలా చదవాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనను మా పాలకవర్గం ఎప్పుడు కృషి చేస్తుందని అన్నారు. సిసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులో వచ్చేలా కృషి చేస్తామని ప్రకటించారు. ఈ



కార్యక్రములో పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్, గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ జక్కుల నరేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ లెంకల లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ బోయిని రవి, వార్డు సభ్యులు భగవంతం, సురేష్, రోజా, నవనిత, సంజీవ్, పద్మమ్మయ్య, దేవల క్ష్మీ లావణ్య, గోరె మీయా, నాయకులు రాజు, లక్ష్మి, నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### బిజెపి రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్

వాస్తవం : మనోహరాబాద్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభు త్వం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నత్తి మల్లేష్ ముదిరాజ్ బిజెపి నాయకులతో కలి సి బుధవారం మనోహరాబాద్ తహసిల్దార్ ఆంజనేయులుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక వాటిలో ఏ ఒక హామీ కూడా ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదని మండి పడ్డారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెం డర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు



ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుతవం పై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్ర భుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, కాళ్లకల్ గ్రామ అధ్యక్షు లు కొత్తూరి మల్లేష్ ముదిరాజ్, మండల నాయకులు ఎర్ర కృష్ణ, బూత్ కమిటీ అధ్యక్షులు చెట్టి రాజు ముదిరాజ్, ఎర్ర శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ మంచి గిరీష్ పాల్గొన్నారు..

# కీ.శే. జి.అర్జున్ కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం

వాస్తవం : అందోల్

సంగారెడ్డి జిల్లా అందోలు మండలంలోని టీజీఎమ్ఆర్ఐ ఈఎస్ కళాశాల జోగిపేటలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన శ్రీ జి.అర్జున్ ఇటీవల అకాల మరణం చెంద దం విషాదకరమని సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎ.మాణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ప్రభు లు తీవ్ర విచారం ప్రకటిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతి చెందిన ఉపాధ్యాయునకు సంఘ క్రియాశీల సభ్యత్వం ఉన్నందున రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు జిల్లా శాఖ పక్షాన సమాచారమందచేసి కీ.శే అర్జున్ సతీమణి శ్రీమతి పి.సౌజన్య కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దే శంతో తక్షణ ఆర్థిక సహాయంగా లక్ష రూపాయల చెక్కును జిల్లా శాఖ ఆధ్వర్యంలో అం దచేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మా నయ్య, ప్రభు మాట్లాడు తూ పి ఆర్ టి యు టి ఎస్ క్రియాశీల సభ్యత్వం కలిగిన ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, సంఘం నిర్వహిస్తున్న సంక్షేమ నిధి ద్వారా అకాల మరణం సంభవిం చిన సభ్యుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తూ ఆసరాగా నిలబడుతూ ఉన్నదని, సభ్యుల సంక్షేమం కోసం



ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని, అవసర సమయం లో ఉపాధ్యాయ కుటుంబాలకు అండగా నిలబడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందోలు (అర్బన్) (రూరల్) మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యస్.నరోత్తం కుమార్, సి.హెచ్.జనార్ధన్ గౌడ్, బి.రాజమల్లు, వి.మయాచారి, ప్రధానోపాధ్యాయులు బి.నరేష్ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు వి.బి.శ్రీనివాస్ , మండల బాధ్యులు సర్దా ర్ , బి.మహేష్ కుమార్, కె.గణేష్, టీజీఎమ్ఆర్ జెసి ప్రిన్సి పాల్ పి.జీవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190




# రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

### చివరి తేదీ ఈనెల 25 ఏవో సతీష్, రైతులకు సూచన

వాస్తవం : సిద్దిపేట ప్రతినిధి




సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని రైతులు రైతు భరోసా కు దరఖాస్తులు చేసుకోవాలని కోహెడ ఏవో సతీష్ బుధవా రం రోజున తెలియజేశారు. గ్రామాలలో ని క్లస్టర్ ఏఈఓ లను కలసి వివరాలు తెలుసుకొని ఏ ఈఓ లకు గాని, వ్యవసా య అధికారి ఏవో కు గాని దరఖాస్తులను సమర్పించగ లరు. తెల ంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం యాసంగి 2025-26 కింద కొత్త దరఖాస్తులు మరియు బ్యాంకు వివ రాల అప్డేట్ కోసం అవకాశం కల్పించింది. 28-2-2026 వరకు కొత్త పట్టా పాసుబుక్కు వచ్చిన రైతులు, ఇప్పటివరకు రైతు భరోసా పొందని అర్హులైన రైతులు, బ్యాం కు వివరాలు నమో దు చేయని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలి. దరఖాస్తు కు కావలసిన పత్రాలు 1) రైతు భరోసా అప్లికేషన్ ఫారం 2) పట్టాదార్ పాస్ బుక్ (పి పి బి) కాపీ 3) ఆధార్ కార్డు 4) బ్యాంకు పాసుబుక్ మొదటి పేజీ లేదా క్యాన్సిల్ చెక్ 5) మొబైల్ నెంబర్ లను జతపరచవలె ను. క్లస్టర్ గ్రా మాలలోని రైతు వేదికల వద్ద ఏఈవో కు గాని, మండల వ్యవసాయ అధికారికి గాని అందజేయగలరు. ఈనెల చివరి తేదీ 25వ తేదీ వరకు అవకాశము ఉన్నది కానీ ఆన్లైన్లో అప్లై చేయాలి కనుక ఒకరోజు ముందు 24వ తేదీ వరకు రైతులు అందజే యగలరు. ఇట్టి అవకాశాన్ని సద్విని యోగం చేసు కోగలరని మండల వ్యవసాయ అధికారి సతీష్ తెలియ జేశారు.

# పిడుగుపాటుకు దగ్ధమైన కొబ్బరి చెట్టు



వాస్తవం : హుస్నాబాద్

ఎండాకాలం ఎండలు కొడుతున్న వేళ ఒక్కసారిగా వాతా వరణం చల్లబడింది. మార్చి 16 నుండి 20 వరకు అకా ల వర్షాలు ఉన్న నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. కాగా మంగళవారం రాత్రి నుండి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ క్ర మంలో బుధవారం తెల్లవారుజామున గం.3:30 ప్రాంత ంలో హుస్నాబాద్ పట్టణంలోని విద్యానగర్లో గల నా రోజు తిరుపతి ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై ఒ క్కసారిగా భారీ శబ్దంతో పిడుగు పడింది. దీంతో చుట్టు పక్కల ఉన్న స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కొబ్బరి చెట్టుపై పిడుగు పడిన వెంటనే మంటలు చెలరేగి దగ్ధమవుతున్న క్రమంలో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన ఆ ప్రదేశానికి చేరుకుని మంటలు ఆర్పారు. జనావాసాలపై పడితే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు అనుకోవడం గమనార్హం. అయితే పిడుగు పడిన సమయంలో ఒక్కసారిగా కరెంటు పోయిందని, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డు, ఫ్యాను, టీవీ కాలి పోయాయని నారోజు తిరుపతి ఇంట్లో అద్దెకు ఉంటున్న పచ్చిమట్ల రాంబాబు తెలిపారు.

# జీతాలు తీసుకుంటూ..
# సభకు రారా?

## కేసీఆర్‌పై రేవంత్ మండిపాటు

- గవర్నర్ ప్రసంగం భవిష్యత్తు తెలంగాణకు ఒక విజన్ డాక్యుమెంట్
- ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు ఎందుకు రాలేదు
- నియంత పోకడలను అనుసరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు
- రాజులు పోయినా, రాజ్యాలు పోయినా... కొందరిలో రాచరిక పోకడలు మాత్రం పోలేదు

**తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగం రాష్ట్ర అభివృద్ధికి ఒక మార్గదర్శిగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగం కేవలం ప్రభుత్వ కార్యక్రమాల జాబితా కాకుండా, భవిష్యత్తు తెలంగాణకు ఒక విజన్ డాక్యుమెంట్‌గా నిలిచిందని పేర్కొన్నారు. ఈరోజు(బుధవారం) అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ ప్రజల ఆశయాలను ప్రతిబింబించిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని చూపించిందని చెప్పుకొచ్చారు. భవిష్యత్తు ఆర్థిక ప్రణాళికలకు బలమైన పునాది వేసిందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.**



**హైదరాబాద్, మార్చి 18 :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగం రాష్ట్ర అభివృద్ధికి ఒక మార్గదర్శిగా నిలిచిందని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగం కేవలం ప్రభుత్వ కార్యక్రమాల జాబితా కాకుండా, భవిష్యత్తు తెలంగాణకు ఒక విజన్ డాక్యుమెంట్‌గా నిలిచిందని పేర్కొన్నారు. బుధ వారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ ప్రజల ఆశయాలను ప్రతిబింబించిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని చూపించిందని చెప్పుకొచ్చా రు. భవిష్యత్తు ఆర్థిక ప్రణాళికలకు బలమైన పునా ది వేసిందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానిం చారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం చారిత్రాత్మకమని ఉద్ఘాటించారు. గవర్నర్ చేసిన ప్రసంగం కేవలం అక్షరాల రూపంలో ఉన్న ఆలోచన కాదని.. తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి అని వ్యాఖ్యానించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రం ఎదగడానికి అవసరమైన విశిష్ఠ ప్రణాళిక అని తెలిపారు. అలాంటి గొప్ప సంకల్పాన్ని, పవిత్ర శాసనసభ వేదిక నుంచి రాష్ట్ర ప్రజల ముందు ఉంచిన గవర్నర్ శుక్లాకి ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిం చిన సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ వస్తారని అనుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్త గవర్నర్‌కు కేసీఆర్ శుభాకాంక్షలు చెబుతారని భావించామని.. కానీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రాజులు పోయినా, రాజ్యాలు పోయినా... కొందరిలో రాచరిక పోకడలు మాత్రం పోలేదని విమర్శించారు. కానీ ఇప్పుడు ప్రజా స్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి ప్రజాస్వామ్య పద్ధతిలో నాయకులను ఎన్నుకుంటున్నారని చెప్పుకొచ్చారు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారని తెలిపారు. ప్రజలే తప్పు చేశారని అనుకుంటున్నారని అన్నారు. నియంత పోకడలను అనుసరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహించారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి ప్రదర్శించారని ధ్వజమెత్తారు. ప్రజలు బుద్ధిచెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా ఇప్పుడూ అదే తీరుగా బీఆర్ఎస్ నేతలు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. డిసెంబర్ 1, 2023 నుంచి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రూ. 1.6కోట్లకు పైగా జీతభత్యాలు పొందారని ప్రస్తావించారు. అసెంబ్లీకి కేసీఆర్ హాజరు కాకుండా జీతభత్యాలు తీసుకోవడంపై సరైన నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సూచించారు.ఇప్పటికైనా కేసీఆర్ సభకు రావాలని, వస్తారని ఆశిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని గవర్నర్ ప్రసంగంలో వివరించారని అన్నారు. సంక్షోభ సమయంలో దేశ ప్రధానిగా జవహర్ లాల్ నెహ్రూ బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు. నెహ్రూ తీసు కున్న ప్రణాళికలతోనే ఇవాళ దేశం ఈ పరిస్థితుల్లో ఉందని తెలిపారు. మొదటి తరంలో నెహ్రూ– ఇందిరాగాంధీ గొప్ప విధానాలు తీసు కువచ్చారని ఉద్ఘాటించారు. సరళీకృత విధానాలతో దేశ ఆర్థిక గతిని మార్చిన ఘనత పీవీ నరసిం హారావుదని తెలిపారు. 1990 నుంచి 2020 వరకు 30 ఏళ్లు పీవీ నరసింహారావు నుంచి మన్మోహన్ సింగ్ వరకు అనేక సంస్కరణలు తీసుకొచ్చారని ప్రస్తావించారు. భవిష్యత్తులో ఏఐ సునామీ రాబోతుందని, దీనిని ఎదుర్కొనేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలో గవర్నర్ ప్రసంగంలో వివరించారన్నారు.




## సీఎస్ రామకృష్ణారావు
# ఉద్యోగ కాలం పొడిగింపు

**మరో 3 నెలల పాటు అవకాశమిస్తూ కేంద్రం ఉత్తర్వులు**



**హైదరాబాద్, మార్చి 18 :** ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు ఉద్యోగకాలాన్ని మరోసారి పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. వాస్తవానికి సీఎస్ రామకృష్ణారావు ఈ నెల 31తో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. అయితే మూడు నెలల పొడిగింపుతో ఆయన జూన్ వరకు ఉద్యోగంలో కొనసాగనున్నారు. సీఎస్ రామకృష్ణారావుకు ఉద్యోగ కాలం పొడిగించడం ఇది రెండోసారి కావడం గమనార్హం. నిరుడు ఏప్రిల్‌లో ఆయన ఉద్యోగ కాలాన్ని ఏడు నెలలపాటు పొడిగించింది. వాస్తవానికి నిరుడు ఏప్రిల్‌లో సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన ఆగస్టులో ఉద్యోగ విరమణ కావాలి. అయితే ఆయన ఉద్యోగ కాలాన్ని ఏడు నెలల పొడిగింపుతో ఇప్పటివరకు కొనసాగారు. తాజాగా మరోసారి మూడు నెలలు పొడిగించడంతో జూన్ నెలాఖరు వరకు ఆయన సీఎస్‌గా కొనసాగనున్నారు.